
# ప్రేమజీవ్

# సుశీలా! నువ్వు సుశీలవు కాదా?



'సుశీలా! నీ గురించి నేను ఇవ్వాళ్ళ ఒకటి విన్నాను' అంది సరళ అప్పుడే వచ్చిన సుశీలతో.

'వినుండవచ్చు...' అంది సుశీల నిర్లిప్తంగా. అసలే తన మూడ్ ఏమీ బాగాలేదు. ఎంతో నీరసంగా, నిరుత్సాహంగా ఇంటికి చేరుకుంది తను.

'ఏమిటని అడగవేం...?'

'తెలుసుకోవాలనే కుతూహలం లేదు' విసుగ్గా జవాబిచ్చింది సుశీల.

'నేన్నమ్మలేకపోతున్నాను దాన్ని'

'అది నీ యిష్టం' నిర్లక్ష్యంగా అంది సుశీల.

'ఏమిటి సుశీలా! నేను విన్నది నిజమేనా?'

'... ... ... ...'

'నన్ను నమ్మమంటున్నావా?'

'... ... ... ...'

'అయితే నన్ను ఇన్నాళ్ళూ ఎందుకు మోసం చేశావ్?'

'... ... ... ...'

'ఏం మాట్లాడవేం?'

'మోసం అని చాలా పెద్ద మాట అంటున్నావ్' సుశీలా! అంది సరళ విస్మయపడుతూ.

'దీన్ని మోసం అనక ఇంకేమన్నా ముద్దుపేరు పెట్టి పిలవమంటావా? నాతో స్నేహం చేసేముందు నువ్వు ఇట్లాంటిదానివని నాకు ఎందుకు చెప్పలేదు?'

'నీకు పనికట్టుకుని చెప్పాల్సిన అవసరం నాకేమీ కనిపించలేదు' జవాబిచ్చింది సుశీల అసహనంగా.

'కనీసం నాతోపాటు నా రూంలో వుంటానికి వచ్చినప్పుడన్నా ఈ నిజం నాతో చెప్పక్కర్లేదా?'

'సరళా! ఎందుకలా ఆవేశపడ్తావ్? నా జీవితానికి సంబంధించిన ఎన్నో నిజాలు నీకు చెప్పలేదు, ఇదీ చెప్పలేదు- అంతే. ఏదో నేరం చేసినదాన్ని శిక్షించే అధికారి నిలదీస్తున్నట్లు ఇలా మాట్లాట్టం బాగోలేదు' కోపంగానే జవాబిచ్చింది సుశీల.

'ఛీ ఛీ... ఎంత సిగ్గు ఎగ్గు లేకుండా మాట్లాడుతున్నావ్! ఇలా చేస్తున్నందుకు కుళ్ళికుళ్ళి చావాల్సింది పోయి, పైగా నేను అడగటం బాగోలేదంటున్నావా? హౌ డేర్ యు ఆర్? నువ్వు నా రూంలో ఒక్క క్షణం వుంటానికి వీల్లేదు- తక్షణం వెళ్ళిపో.'

ఉద్రేకానికి సుశీల నిశ్చేష్టురాలై సరళవంక అలానే చూస్తూ వుండిపోయింది.

'సరళా! సాటి స్త్రీమీద సానుభూతన్నా చూపకుండా, ఇంత రాత్రివేళ అర్థాంతరంగా బయటికి వెళ్ళిపొమ్మనేంత సభ్యతా, సంస్కారం లేనిదానివా నువ్వు...'

'అర్థరాత్రి వరకు సిటీ అంతా తిరిగి రాగలదానివి- నీకేంటి భయం- నథింగ్ డూయింగ్- ఫస్ట్ గెటౌట్.'

సుశీల కళ్ళల్లో నీళ్ళు చెమర్చాయి... మౌనంగా వెళ్ళి పెట్టెలో తన బట్టలు పెట్టుకుని వెళ్ళిపోబోతూ 'సరళా! నువ్వు నన్ను వెళ్ళిపొమ్మన్నందుకు బాధపడటం లేదు... నీకేదో తెలిసిపోయిందని అంతకంటే బాధపట్టం లేదు... ఆ తెలిసిపోయిన విషయం నిజమే అయినందుకు అసలే బాధపట్టం లేదు... ఇన్నాళ్ళూ నువ్వు చూపించిన ఆప్యాయత నా మనస్సును ఎంతో సజీవంగా వుంచింది. ఆ నీ ఆప్యాయతకు దూరమవుతున్నందుకు మాత్రం బాధగా వుంది' అంది నిశ్చలంగా.

సుశీలకు రోడ్డుమీదకు వచ్చాక ఎటుపోవాలో తోచలేదు. ఎన్నడు లేంది తనివ్వాళ్ళ బలవంతంగా తాగాల్సి వచ్చింది. కొద్దిగా తూలుతున్నట్లుగా వుంది. వళ్ళంతా నొప్పులుగా వుంది. బాగా అలసిపోయినట్లుగా, నీరసంగా

వుంది. కాళ్ళు తేలిపోతున్నాయి. ఆటో ఎక్కి నాగప్ప ఇంటికి వెళ్ళింది. నాగప్ప అటెండర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాక, మంచి మంచి అమ్మాయిల్ని బాగా డబ్బున్న వాళ్ళకు, పెద్ద ఆఫీసర్లకు బుక్‌చేసిపెట్టే పని చేపట్టాడు. ఆవేళప్పుడు సుశీల తనింటికి రావడం చూసి ఆశ్చర్య పోయాడు.

'నాగప్పా, ఈ రాత్రికి నేను మీ ఇంట్లో వుంటాను. పొద్దున్నే అర్జంటుగా నాకో రూం చూసిపెట్టు' అంది. అతను సరేనన్నాడు. నాగప్ప భార్య, పిల్లలు ఆమెను ఎంతో ఆదరంగా చూశారు. వాళ్ళిచ్చిన మజ్జిగ తాగి వారి ప్రక్కనే పడుకుంది.


** ** **

సుశీల ఒక మెడికల్ అండ్ జనరల్ షాపులో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తోంది. సరళ తరచు ఆ షాపుకు పర్చేజస్‌కు వెళ్తుండటంతో ఇద్దరికీ బాగా పరిచయం అయింది. సరళకు బ్యాంకులో ఉద్యోగం. పెళ్ళి కాలేదు.

ఒక రోజున సరళను 'మీరున్నవేపున ఒక రూం ఏమన్నా దొరుకుతుందా, నేనుంటున్న రూం ఖాళీ చేయాల్సివచ్చింది' అని అడిగింది సుశీల.

'నా రూంలో నేనొక్కత్తినే వుంటున్నా, నువ్వొచ్చి వుండచ్చు, ఇద్దరికీ కంపెనీ వుంటుంది' అని ఆఫర్ చేసింది సరళ.

సుశీల సరళ రూంలో చేరి ఆర్నెల్లయింది. సుశీల




గ్రాడ్యుయేట్ అయినా ఎక్కడా ఉద్యోగం దొరక్క సేల్స్‌గర్ల్‌గా పని చేస్తున్నందుకు సరళకు ఆమెమీద సింపతిగా వుండేది. ఇద్దరూ చాలా స్నేహంగా, సరదాగా వుంటుండేవారు.

** ** **

ఆ రాత్రి సుశీల వెళ్ళిపోయాక సరళకు ఆలోచనలతో నిద్రపట్టలేదు- సుశీల ఎంత మంచిది. ఎంత కలుపుగోలుగా, వినయంగా వుంటుంది! ఆమె తెలివితేటలకు, అందానికి తనెంతో మురిసిపోయేది. అలాంటి సుశీల- ఆమె నిజంగా సుశీలే అని తనెంతో గౌరవించిన సుశీల- 'ఇల్లా' చేస్తుందంటే నమ్మలేకపోతున్నది. ఆమె అప్పుడప్పుడు రాత్రిళ్ళు లేటుగా వచ్చి ఏవో కారణాలు చెప్పేది, అయినా తనకెప్పుడూ అనుమానం కలగలేదు. ఆమెకు ఆశ్చర్యంగాను, బాధగానూ వుంది. సుశీలను ఏడాదిగా తనుఎరుగును- ఆర్నెల్లుగా తనతోనే వుంటూ, ఎంతో సన్నిహితంగా ఆమెతో మెసిలింది. ఆమెకు ఎంతో ఉన్నతమైన భావాలున్నట్లు తను గ్రహించ గలిగిందేగానీ ఆమె ఇలాంటిదని తనకెన్నడూ అనిపించ లేదు. ఆమెలో అశ్లీల స్వభావ లక్షణాలు ఎన్నడూ చూళ్ళేదు. అంత సభ్యతగల సుశీలను అటువంటి దానిగా తనూహించలేకపోతున్నది. కాని సుశీలే దానిని కాదనప్పుడు తను నమ్మకుండా ఎలా వుండాలి? అది నిజం కాకుంటే ఎంత బావుణ్ను. కనీసం సుశీల ఒక్క మాట-'అది అబద్ధం' అనుంటే తను ఎంతసంతోషించి వుండేది? తనింకేమీ అడిగేది కాదు. సుశీల అలా అనక పోగా, పెడసరంగా మాట్లాడేప్పటికి, తను కోపం ఆపుకోలేక, నిర్దాక్షిణ్యంగా ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంది. ఆ చీకట్లో ఎక్కడికెళ్ళిందో, ఏం చేస్తోందో? ఛీ, తనెంత క్రూరంగా ప్రవర్తించింది? ఆ రోజున తన కొలీగ్ 'మి

బాలల ప్రపంచంలో వికసిస్తున్న
వినూత్న పుష్పం

10,000
రూపాయలకు
పైగా
బహుమతులు




భావి పౌరుల మేటి పక్షపత్రిక నిర్వహిస్తున్న
బహుముఖ పోటీలో
(నవలలు, కథలు, కవితలు, కార్టూన్ల పోటీ)
పాల్గొనదల్చిన రచయిత(త్రు)లకు, కవులకు, కార్టూనిస్టులకు స్వాగతం!
పోటీ ముగింపు: 30 మే 1986
పూర్తి వివరాలకు:
ఎడిటర్, "చిన్నారి"
ప్రతిభా నిలయం, వనస్థలిపురం, హైదరాబాద్-500 661.

పాలిటెక్నిక్
A.P. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి
నాగార్జునసాగర్.-కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు
ఒకే శాండ్ విచ్ కోర్సు
రెండు దశాబ్దాలకు పైగా అనుభవము గాంచిన
శ్రీ విద్యా విహార్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్
కోర్సు వారి ఆధ్వర్యంలో
మీ విజయానికి నూటికి రెండువందలపాళ్ళు అవకాశం
అడ్మిషన్లు: 25-4-86. వివరములకు: కోర్సు ప్రారంభం: 6-5-86



స్థాపితము: 1962 Ph: 32084, 31977
శ్రీ విద్యా విహార్
(ఆదర్శ గురుకుల విద్యాసంస్థ)
రింగ్ రోడ్, లక్ష్మీనందనగర్, గుంటూరు-6
PRAGATHI
బాల బాలికలకు వేర్వేరు ఫర్నిష్డ్ హాస్టల్సు
రు.100/- M.O. లేక D.D. పంపి సీటు రిజర్వు చేసుకొనండి!

రూమ్మేట్ ఇలాంటిది' అన్నప్పుడు తనెంతో అప్సెట్ అయింది. ఎవరో గిట్టనివాళ్ళు అలా అపవాదు వేసుంటారని ఎంతో వాదించింది. కాని ఇప్పుడు వాళ్ళకి ఏమని చెప్పాలి?

మర్నాడు సరళ ఆఫీసుకు వెళ్ళిందేగాని మనసేమీ బాగోలేదు. ఎంత వద్దనుకున్నా సుశీల గురించి ఆలోచించకుండా వుండలేకపోయింది. తను ఇంక సుశీలను మర్చిపోవాలి- తనే ఆమెను కఠినంగా తిట్టి వెళ్ళకొట్టింది. తొందరపాటుతో ఎంత మంచి స్నేహితురాల్ని పోగొట్టుకుంది? కాని సుశీల గురించి విన్న సత్యాన్ని ఆమె భరించలేకుండా వుంది- ఆ సత్యం అసత్యమని ఏదో విధంగా తనకు తెలిస్తే ఎంత హాయిగా వుండును!

ఓ వారం రోజులు సరళ తనలోతాను మథన పడుతూ గడిపింది. సుశీలను తన మనసులోనుంచి తుంచివేసుకోలేకపోతోంది. తనకేదో వెలితి ఏర్పడ్డట్టూ, తనేదో కోల్పోయినట్టూ బాధపడింది. సుశీల సౌశీల్యం మీదకంటే ఆమె వ్యక్తిత్వంమీద సరళ ధ్యాసపోయేది. సుశీలను చూడకుండా వుండలేకపోయింది. సుశీలను కలవాలని, ఆమెతో ఒకసారి మాట్లాడాలని ఆమె మనసు తహతహలాడింది. చివరికి ఒక రోజున సుశీల పనిచేసే షాపుకు వెళ్ళింది. ఆమె అప్పుడే వంట్లో బాగోలేదని చెప్పి ఇంటికి వెళ్ళిపోయిందని ఇంటి అడ్రస్ ఇచ్చారు.

సరళ వెళ్ళేప్పటికి సుశీల చాపమీద బోర్లాపడుకుని వుంది. సరళ ఆమె ప్రక్కనే కూర్చుని, తలమీద చెయ్యివేసి, 'సుశీలా' అని పిలిచింది. సుశీల లేచి, 'సరళా, వచ్చావా' అంది ఆమె రెండు చేతులు తీసుకుని తన చెంపలకు అద్దుకుంటూ.

'నీ మనస్సు చాలా నొప్పించాను కదూ' అంది సరళ.

'సరళా,నువ్వేమన్నా నేనేమీ అనుకోను- నీ స్నేహం నాక్కావాలి- నీ తిరస్కారాన్ని నేను భరించలేను' అంటూ సరళ కళ్ళల్లోకి దీలగా చూసింది సుశీల.

'నేనూ అందుకేగా నిన్ను వెతుక్కుంటూ వచ్చింది. సుశీలా! ఒక్కమాట చెప్పు- నేను విన్నది నిజం కాదని ఒక్కమాట చెప్పు, ఎంత సంతోషిస్తానో-'

'సరళా- నిజాన్ని నిజమని చెప్పడమే నా స్వభావమని నీకు తెలుసు. నిన్ను తృప్తిపరచడానికి అందుకు భిన్నంగా చెప్పి నిన్ను మభ్యపెట్టలేను.'

'ఏమిటి సుశీలా? నిజమేనా? నేను ఈ నిజాన్ని ఎలా తట్టుకోను సుశీలా? ఎందుకిలా చేస్తున్నావు, నాకు చెప్పవూ?'

సుశీల ప్రశాంత వదనంలో ఒక్కసారిగా విషాదం వ్యాపించింది—

'సరళా! ఈ సమాజం నన్ను కాటేసింది- నాలో విషం కాక అమృతం ఎలా వుంటుంది? నాలో జీవిస్తున్నది నేను కాదు, సరళా! ఈ సంఘం సృష్టించిన 'కాలుష్యం' యొక్క ప్రతిబింబమే నా జీవితం. నా జీవితాన్ని నేను అభిలషించిన రీతిలో పొందలేకపోయాను- ఈ కుళ్ళు వ్యవస్థ నన్ను మలచిన రీతిలోనే నా జీవితం రూపుదాల్చింది' సుశీల ఆగి ఒకసారి నిట్టూర్చింది-

ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది.

'మాది చాలా సామాన్య కుటుంబం. మేం నల్గురం ఆడపిల్లలం- నేనే పెద్దదాన్ని. మా నాన్న ఎంతో కష్టపడుతూ నన్ను డిగ్రీవరకు చదివించారు. పేదింటి ఆడపిల్ల కాలేజీలోను, రోడ్లమీద, వాడకట్టుల్లోను ఎంత చులకనగా చూడబడుతుందో, ఎన్ని అవమానాలకు గురవుతుందో అన్నీ పొందాను. మా పక్కింటి ధనవంతుల అబ్బాయి నన్ను ప్రేమించానన్నాడు, కట్నం లేకుండా, పెద్దవాళ్ళను ఎదిరించైనాసరే పెళ్ళి చేసుకుంటానన్నాడు, నమ్మించాడు, తొందరపెట్టాడు, అనుభవించాడు, మొహం చాటేశాడు. నాన్న ఒకవైపు పెళ్ళిచేయలేక, మరోవైపున ఈ జరిగినదానికి దిగులుతో కృంగిపోయి, పక్షవాతం వచ్చి మంచానపడ్డాడు. అమ్మ పెద్దది, ఏమీ తెలియని అమాయకురాలు. ఇంకా చదువుకుని పైకి రావాల్సిన, అభంశుభం తెలియని ముగ్గురు చెల్లెళ్ళు. ఇంతమందిం బ్రతకాలి. నాకు పెళ్ళన్నా, మొగాళ్ళన్నా, చివరికి బ్రతుకన్నా ఎలర్జీ వచ్చేసింది. నేను తేలిగ్గా ఆత్మహత్య చేసుకోవచ్చు- కాని చేసుకోలేదు. ఎందుకు చేసుకోవాలి? నాకు ఈ భూమ్మీద బ్రతికే హక్కులేదా? నాకున్న హక్కును నేనెందుకు వదులుకోవాలి, ఈ లోకానికి ఎదురీదుతూ అయినా బ్రతకాల్సిందే. నేను నాకోసం బ్రతకడమే కాదు, మరో అయిదుగుర్ని బ్రతికించడానిక్కూడా బ్రతికితీరాలి. నేను జీవితంమీద విరక్తితో, భయంతో, పిరికితనంతో బ్రతకడం విరమిస్తే, అయిదు నిండు ప్రాణాలు బలైపోతాయి. అందువల్ల నేను జీవించక తప్పలేదు. డిగ్రీ చేతపట్టుకుని ఉద్యోగం కోసం ఎంత ప్రయత్నించినా దొరకలేదు- రికమండేషన్ చేసేవాళ్ళుగానీ, లంచం పెట్టేందుకు డబ్బుగానీ లేనివాళ్ళందరికీ పట్టే దౌర్భాగ్యమే నాకూ పట్టింది. చివరకు హైదరాబాదు వచ్చి, ఇక్కడ మావూరివాళ్ళు ఒకరు వుంటే, వారిద్వారా ఆ షాపులో మూడొందల జీతానికి సేల్స్‌గర్ల్ ఉద్యోగం సంపాదించాను. ఆ మూడొందలతో ఇక్కడ నేను బ్రతుకుతూ, అక్కడ మావూళ్ళో మరో అయిదుగుర్ని బ్రతికించాలి. అయినా నేను నిరాశపడలేదు.

నేను షాపులో చేరిన వారం రోజులకు- నా అసహాయతను గుర్తించిన ఆ సేటు కుమారుడు అనుకూలమైన పరిస్థితులు కల్పించుకుని, నన్ను బలవంతంగా అనుభవించి, వంద రూపాయిలు పారితోషికంగా చేతిలో పెట్టాడు. నేను వాటిని వాడి మొహానకొట్టాను.

'అందరూ ఎంతో గొప్పగా ధ్యానించే 'స్త్రీ శీలం' యొక్క వాస్తవికత ఈ రూపంలోనా మనకు దక్కుతున్నది? స్త్రీకి శీలమేనా ముఖ్యం- జీవితం కాదా? శీలం పోయిన స్త్రీకి బ్రతికే హక్కులేదా? స్త్రీ శీలాన్ని హరించే ఈ మగాళ్ళూ, స్త్రీ శీలాన్ని దోచుకునేందుకు ఆసరా ఇస్తున్న ఈ వ్యవస్థ మాత్రం సది కాలాలపాటు పదిలంగా వుండాలా? తప్పుచేసినవారికి శిక్షే లేదా? అన్యాయానికి గురైనవారే అణగారిపోవాలా? అదే ఈ వ్యవస్థ స్వభావమా? అదే నీతా? అదే ధర్మమా? తరతరాల మానవ నాగరికత స్త్రీకి ఇస్తున్న స్థానం

# రతనాలసీమ

నేను
కవిత్వం వ్రాయడం లేదు
కరువును గూర్చి మాట్లాడుతున్నాను
నా సీమలో.
అన్నార్తుల ఆకలి కేకల
హాహాకారాలను భరించలేని
భూమితల్లి గుండెలు ఫెడేళ్ళున పగిలి
బీటలు వారిపోయినాయి

పచ్చని పుట్టములు తొడిగి
నిత్యము కళకళలాడుతూ
కనిపించే ప్రకృతిమాత
చిక్కి శుష్కించిన దిగంబర
బికుకిలా బిక్కుబిక్కు మంటూంది

రామాపురం సంతలో రేపో, మాపో
వధ్యశాలకు చేరబోతున్న
గంగిగోవుసుతను చివరి అశ్రు కణాలతో
కరువు రక్కసికి తర్పణం చేస్తూంది

మాసుళ్ళు ముగించుకుని
కూతురు పెండ్లి చేయాలనుకున్న
కృషీవలుడు, ఫలితం శూన్యంకాగా
కన్నబిడ్డ తన గుండెలమీద పడుస్తున్నట్లు
తల్లడిల్లిపోతూ, మూలనకూర్చుని
మూల్గుతున్నాడు.

కూలీ నాలీ చేసి
పసికందుల క్షుద్బాధను
చల్లారుస్తూండిన, దిక్కులేని
సింగన్నగారి గంగమ్మ
కన్న బిడ్డల ప్రాణాలనుకాపాడడం కోసం
పట్నంలో ప్రతి వీథీ తిరిగి
శీలాన్ని అమ్ముకుంటూంది.

నా సీమలో
కన్నీళ్ళు కూడా కరువై పోయాయి
మనుషుల్ని, మనుషులు
చంపుకుని తినే రోజులొస్తున్నాయి
నా సీమలో
దారిద్ర్యం పట్టాభిషేకం చేసుకుంటూంది
నా సీమలో
భయంకరమైన ఎడారి తిష్టవేసుకుంటూంది.

—షేక్ హుసేన్.

ఇదేనా?- ఏమిటో ఏమీ బోధపడేది కాదు- ఏమి చెయ్యాలో తెలిసేది కాదు. ఎప్పుడు నా కళ్ళముందు అయిదుగురి నిండు ప్రాణాలు దీనంగా నావంక మాస్తూ కదలాడుతూ వుండేవి.'

సుశీల చెప్పడం ఆపి, 'సరళా, మొదటిసారి నా రూంకి వచ్చావ్, కాఫీ అన్నా ఇవ్వకుండా కూర్చో పెట్టాను- వుండు, ఇప్పుడే కాఫీ చేసి తీసుకువస్తాను' అని లేచి వెళ్ళింది.

సరళ మనస్సు చాలా వ్యాకులంగా వుంది- నిశ్చేష్టురాలై కూర్చుండిపోయింది ఏమీ మాట్లాడకుండా.

సుశీల సరళకు కాఫీ ఇచ్చి తనూ తాగుతూ-

'సరళా, నన్ను నేను ఏదో సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నానని అనుకోకు-నా జీవితం గురించి ఒకరికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరం కూడా నాకేమీ లేదు. నాలోని ఆవేదన ఒక ఆత్మీయురాలితో చెప్పుకోగల్గుతున్నందుకు ఇవ్వాళ్ళ నాకు చాలా రిలీఫ్‌గా వుంది.


'ఒకసారి రెండు రోజులు భోజనం లేక కళ్ళు తిరిగి రోడ్డుమీద పడిపోయాను. తెలివి వచ్చేప్పటికి వాగప్ప ఇంట్లో వున్నాను. అతనొక బ్రోకరని నాకు తెలియదు. అతను నన్ను ఆదరించినట్లే ఆదరించి తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించుకున్నాడు- అప్పుడు తెలిసింది నేను ఎక్కడ వున్నానో- నేను ఎంత బ్రతిమాలినా, అరిచినా, ఏడ్చినా, ఎదిరించినా ప్రయోజనం లేకపోయింది. అలా ఈ సంఘం నన్ను చీకటి కోణంలోకి ఈడ్చుకుపోయింది. ఈ సమాజం నన్ను బలవంతంగా బలిపీఠం మీద కూర్చోపెట్టి వధించింది- తత్ఫలితంగా ఓ అయిదుగురు చావకుండా బ్రతికేందుకు ఈ వ్యవస్థ అనుమతి ఇచ్చింది, అవకాశం కల్పించింది. నా ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే, నా ఆలోచనల్తో నిమిత్తం లేకుండానే నా జీవితం సాగిపోతోంది.

'పాడైపోయిన జీవితం ఎలాగ- పాడైపోయింది- ందరి స్త్రీల్లా నేను మామూలు జీవితం కోరుకోవడం ఎండమావిలాంటిది. నా పూనిక లేకుండానే నా శిథిల జీవితం కొందరిని బ్రతికిస్తుంటే నేను నిమిత్తమాత్రురాలిగా బ్రతికేస్తున్నాను.




'ఇప్పుడు చెప్పు, సరళా! నేను కావాలని, యిష్టపూర్తిగా, ఏ విలాసాలకోసమో ఇలా జీవించడం లేదు. నాకు సంపాదనే ఉద్దేశ్యమైతే ఈపాటికి స్థితిమంతురాల్ని అయ్యేదాన్ని- మావాళ్ళ అవసరాలకు సరిపడేంత నాచేతికి రాగానే, నేను దానికి దూరంగా వుంటుంటాను. విధిలేక జీవిస్తున్న 'ఆ' జీవితాన్ని చాలా పరిమితంగా జీవిస్తుంటాను. నన్ను అవినీతిపరురాలని వేలెత్తి చూపే ఈ సమాజం కాదా నన్ను ఈ స్థితికి కూలతోసింది?

'ఇది ఒక నాకథే కాదు-ఎందరో అభాగినుల గాథ కూడా ఇదే- ఈ చరిత్ర కొత్తదేమీ కాదు- ఈ వ్యవస్థలోని తరతరాల నిర్భాగ్యుల పాత చరిత్రే ఇది- ఈ చరిత్రకు బాధ్యులెవ్వరు? కొత్త చరిత్రకు స్వాగతం పలికేదెవ్వరు? ఈ వ్యవస్థ మారనంత కాలం ఈ చరిత్రా మారదు- ఆర్థిక నీతి రానంతకాలం, దోపిడీ, అవినీతి సాగుతున్నంతకాలం, సాంఘిక నీతి రాదు- ఈ చరిత్రా ఇలాగే నడుస్తూ వుంటుంది- కేవలం వ్యక్తుల పేర్లు మారుతూంటాయి- అంతే...'




సరళ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి-

'ఇంత వ్యధ నీ గుండెల్లో ఎలా అణచుకున్నావ్, సుశీ! ఏ సమస్యకైనా చావు పరిష్కారం కాదనుకుంటే, ఇటువంటి పరిస్థితులలో, ఏ స్త్రీకైనా, ఇంతకంటే మెరుగైన పద్ధతిలో జీవించే అవకాశం వుండదేమో.'

సుశీల కళ్ళు తృప్తిగా మెరిసాయి- ఆ మాటలకు.

'సరళా! నువ్వు నన్ను ఎలా అర్థం చేసుకుంటావో నని బాధపడ్డాను...'

'నేను ఎన్నడూ ఆలోచించని విషయం గురించి నా కళ్ళు తెరిపించావు- నాకు ఇప్పుడే ఈ లోకం కొత్త కొత్త తెలుస్తోంది- మనం మానవ స్పృహలేని సమాజంలో, సామాజికస్పృహ లేని మనుష్యుల మధ్య జీవిస్తున్నామనేది నాకిప్పుడు అర్థమయింది.

'మానం ప్రాణంకన్నా విలువైంది కాదు- అలా అని విచ్చలవిడితనాన్ని మనం సమర్థిస్తున్నామని ఎవరైనా అనుకుంటే పొరపాటు- తప్పనిసరై ఒక స్త్రీ శీలం కోల్పోయిన స్థితిలో జీవించాల్సివస్తే, ఆమెను చూసి ఈ సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధపడాలి, సిగ్గుపడాలి. సమాజాన్ని సంస్కరించడానికి పూనుకోవాలితప్ప ఆమెను హేయంగా చూసి, ఆమెమీద రాళ్ళు వేసే హక్కు ఎవరికీ లేదు. ఆమె జీవితానికి పట్టిన దుర్గతికి నైతికబాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిమీద వుంటుంది. ఆమెను ఆదరించకపోతే మానె ఆమెను నిరాదరించడం అంటే అంతకన్నా అమానుషమైంది మరొకటి వుండదు.

'అసలు స్త్రీ శీలవతిగా వుండాలి అనేది- కేవలం మొగాడు తన స్వార్థంకోసం, కుళ్ళుబుద్ధితో కల్పించిన ఒక స్లోగన్, ఒక ఫాల్స్ సెంటిమెంట్ మాత్రమే. శీలం అనేది అవసరం అనుకుంటే- అది స్త్రీపురుషులిద్దరికీ సమానంగావే అవసరం- ఒక్క స్త్రీకే కాదు. శీలం కోల్పోయిందనుకున్న ప్రతి స్త్రీ ప్రక్కనా శీలం కోల్పోయిన ఒక పురుషుడు కూడా వుంటాడు. స్త్రీని మాత్రమే శీలం కోల్పోయిందని, పురుషుడి శీలం భద్రంగా వుందని భావించడం అంత నీచం మరొకటి వుండదు.'

'సుశీలా! నిన్ను ఎవ్వరు ఎంత అగౌరవంగా చూసినా, నేను నిన్ను నిండు మనస్సుతో గౌరవిస్తాను, ఆదరిస్తాను. మన ఆత్మీయత ఎన్నటికీ చెరిగిపోదు. నువ్వు ఇంక ఇక్కడ వుండటానికి వీల్లేదు. నువ్వు నాతోనే నా రూంలోనే వుంటావ్. లేచి మొహం కడుక్కురా- ఈలోగా నీ బట్టలు సూట్‌కేస్‌లో సర్దుతా' అంటూ సుశీల చెయ్యిపట్టుకుని మెల్లిగా లేవదీసింది.

సుశీల కృతజ్ఞతగా, ఆప్యాయంగా సరళ మొహంలోకి ఒకసారి చూసి- టవల్ తీసుకుని బాత్‌రూంవైపుకు వెళ్ళింది.